ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 17 | సంచిక : 08 | ఏప్రియల్ 2012

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

☎ 08814 - 224747

9247104551


ఈ సంచికలో....


విశాఖపట్నం ... 12-09-2011

జిన్నూరు ......... 20-02-2012



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-09-2011, విశాఖపట్నం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

యోగయుక్తుడు అంటే వ్యక్తిభావన లేకుండా, అహంభావన లేకుండా కర్మని యోగంగా చేసేవాడిని యోగయుక్తుడు అంటారు. నేను చేస్తున్నాను అనే తలంపుతోటి పనిచేస్తే ఆ కర్మ కర్తని వెంటాడుతూ ఉంటుంది. కర్తృత్వం లేకుండా పనిచేస్తే వాడికి శాంతి కలుగుతుంది. సుఖం కలుగుతుంది. నిష్కామకర్మ బ్రాహ్మీస్థితి పొందటానికి సహకరిస్తుంది. మనం చేస్తున్న పని బ్రాహ్మీస్థితిని పొందటానికి అనుకూలంగా ఉండాలి. అదే కర్మయోగం.

మాటలో నియమంగా ఉండమని, ఆహారవిషయంలో నియమంగా ఉండమని, అతినిద్ర పనికిరాదని, వ్యవహారం కూడా తగుమాత్రంగా ఉండాలి అని ఈ నియమాలన్నీ మనస్సుని నీకు అనుకూలంగా చేసుకోవటానికి పెద్దలు చెప్పారు. మన చేతిలో మనస్సు ఉండాలికాని, మనస్సు చేతిలో మనం ఉండకూడదు. మన చేతిలో కనుక మనస్సు ఉంటే అది మనకు మిత్రుడిగా పనిచేస్తుంది. మనస్సు చేతిలో మనం ఉంటే ఆ మనస్సే మనకి శత్రువుగా పనిచేస్తుంది. మన చేతిలో మనస్సు ఉంటే బాహ్యంగా మనకు ఎంతమంది శత్రువులు ఉన్నా ఎవరూ మనల్ని ఏమీ చేయలేరు. మనస్సు చేతిలో మనం ఉంటే ఎంతమంది మన అభివృద్ధికి కృషి చేసినా ప్రయోజనం కనబడదు. అందుచేత నీ మనస్సుని నువ్వు విరోధంగా చేసుకోకు. నీకు బంధువుగా చేసుకో. ఆ మనస్సు నీ ఆధ్యాత్మిక పురోభివృద్ధికి, భౌతిక పురోభివృద్ధికి

కూడా ఉపయోగపడుతుంది. మనోనిగ్రహం లేకపోతే ఇహమూ లేదు, పరమూలేదు. మనం భౌతికంగా అయినా, ఆధ్యాత్మికంగా అయినా అభివృద్ధిలోకి రావాలంటే మన మనస్సుని మనం నియమించుకోవాలి.

పవిత్రమైన హృదయము కలవాడు, హృదయశుద్ధి గలవారు ధన్యులు వారు దేవుని చూచెదరు. ఆలోచన, మాట, చేత ఒకటిగా ఉన్నవాడికి హృదయశుద్ధి కలుగుతుంది. హృదయశుద్ధిని మనం సంపాదించాలంటే సత్వగుణం సంపాదించాలి. హృదయశుద్ధి లేకపోతే మనకి బ్రాహ్మీస్థితి సాధ్యముకాదు. హృదయశుద్ధి మనకి ఉందో లేదో చూచుకుని లేకపోతే సంపాదించుకోవాలి కాని లేదు లేదు అనుకోకూడదు. ఏ పని చేసినా ఆ పని ద్వారా మనం హృదయశుద్ధి పొందుతున్నామా, లేదా అని చూచుకోవాలి. మనస్సు ఎక్కడ అణుగుతుందో అక్కడ సత్యము తెలియబడుతుంది కాని అది మనస్సు చేత గ్రహింపబడేది కాదు. మనోనాశనానికి అనేక ఉపాయాలు భగవద్గీతలో చెప్పాడు.

మనం మనస్సునీ, ఇంద్రియాలనీ నియమించుకోవాలి. మన మనస్సు ఏ విషయాల గురించి బాహ్యాముఖం అవుతోంది అని పరిశీలించుకుని, ఆ విషయాలనుండి బయట పడటానికి మనం ప్రయత్నం చేసుకోవాలి. మనకి ఇష్టాలు, అయిష్టాలు ఎక్కడా లేవు అనుకోండి అప్పడు మీ మనస్సుని కదలమంటే కదలదు. ఇష్టమూ బంధమే, అయిష్టమూ బంధమే. రెండూ మనల్ని బంధిస్తాయి. ఇష్టాలు, అయిష్టాలులోనుండి నువ్వు విడుదల పొందలేకపోతే మనస్సు యొక్క చాపల్యంలోనుండి నువ్వు బయటకు రాలేవు. ఆహారంలో నుండే మనకి శరీరం తయారవుతోంది, ఆహారంలోనుండే మన మనస్సు తయారవుతోంది. అందుచేత ఆహారవిషయంలో నువ్వు జాగ్రత్త తీసుకుంటే ఇంద్రియాలు, మనస్సు స్వాధీనంలోకి వస్తాయి. మన శరీరాలు వేరుగా ఉన్నాయి, మన మనస్సులు వేరుగా ఉన్నాయి, మన ప్రవృత్తి వేరుగా ఉంటుంది కాని హృదయంలో ఉన్న బ్రహ్మపదార్థం ఒక్కటే. మనం ఎవరికైనా పండు ఇస్తే అది అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడే స్వీకరిస్తున్నాడు. కాని మనం వ్యక్తికి ఇస్తున్నాం అని అనుకుంటాము. దీనికి రమణమహర్షిగారు అన్నారు నువ్వు ఇతరులకు ఏది ఇచ్చినా అది మళ్ళీ తిరిగి నీకే వచ్చేస్తుంది అన్న సంగతి తెలిస్తే నువ్వు ఇతరులకు ఏమైనా ఇవ్వకుండా ఉండగలవా? నువ్వు మంచిచేసినా, చెడ్డచేసినా అది లోపల ఉన్న ఈశ్వరుడికే అందుతుంది.

అందుచేత నువ్వు మంచికి మంచి, చెడ్డకి చెడ్డ, ఎత్తుకు ఎత్తు భవిష్యత్తులో నీకు అనుభవానికి వస్తుంది. ఈ కర్మ నేను చేస్తున్నాను అని నువ్వు చేసావా నువ్వు ఏ లోకంలో ఉన్నా, ఏ జన్మలో ఉన్నా ఆ కర్మ నిన్ను వెంటాడుతూ ఉంటుంది. నేను చేస్తున్నాను అనే తలంపు లేకుండా నువ్వు పనిచేస్తే నీకు రెండు లాభాలు. ఫలితానికి ఫలితం వస్తుంది. నీ మనస్సు పవిత్రం అవుతుంది. ఆ పని నిన్ను ఈశ్వరానుభవం పొందటానికి ప్రిపేర్ చేస్తుంది. స్వార్థంతో పనిచేస్తే దేహభావనని పెంచుతుంది. స్వార్థం లేకుండా పని చేస్తే దేహభావనలోనుండి విడుదల చేస్తుంది.

ఆత్మస్తుతి, పరనింద ఇవి రెండూ పెద్ద రోగాలు. చాలామంది వాళ్ళని వాళ్ళు పొగుడుకుంటూ ఉంటారు. ఇతరుల్ని విమర్శిస్తూ ఉంటారు. ఇతరుల్ని విమర్శించేవాళ్ళ గురించి షిరిడీసాయిబాబా అనేవారు మీరు రోజూ అన్నం తినటం మానేసి వాళ్ళ మలం ఎందుకు తింటారు, వాళ్ళ మలం తింటున్నారు అని మీకు తెలియక అలా విమర్శిస్తున్నారు అని చెప్పేవారు. వాళ్ళ లోపాల గురించి మీరు మాట్లాడేబదులు, మీలో లోపాలు ఉంటే వెదుక్కుని వాటిని బయటికిలాగి తగలబెట్టుకోండి అన్నారు. ఇతరుల్ని విమర్శించటం వలన మీకేమీ కలిసిరాదు పైగా పాపం వస్తుంది, వాళ్ళు చేసిన దోషాలు మీకు అంటుకుంటాయి. ఆ ఫలితం మీరు అనుభవించవలసి ఉంటుంది. అందుచేత సాధకుడు ఆత్మస్తుతి, పరనింద ఈ రెండూ విడిచిపెట్టటానికి ప్రయత్నం చేయాలి.

ఉన్నది ఒక్కటంటే ఒక్కటే. అది అంతటా ఉంది. అది లేనిచోటు అంటూ లేదు. అది మన హృదయంలో సాక్షిగా ఉంది. మనం చేత్తోటి చేసేపనికేకాదు, నోటితోటి మాట్లాడే మాటకేకాదు, మనకి ఏ తలంపు వచ్చినా ఆ తలంపుకి భగవంతుడు సాక్షిగా ఉన్నాడు. ఏదో జన్మలో ఆయనకు మనం సమాధానం చెప్పాలి. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే సజీవమైన విశ్వాసము ఉండాలి. అయితే మన విశ్వాసం అంత లోతుగా లేదు. మనకి ఆత్మవిశ్వాసం తక్కువ ఉంటే, ధైర్యము తక్కువ ఉంటే ప్రతీదానికీ దుఃఖము వచ్చి నెత్తిమీద పడుతూ ఉంటుంది. దుఃఖము మనం ఎందుకు నిరాకరిస్తామంటే మన స్వరూపంలో దుఃఖం లేదు కాబట్టి, ఆనందం వస్తే స్వీకరిస్తాము ఎందుచేత మన స్వరూపంలో ఆనందం ఉంది కాబట్టి. మనకి మరణం వస్తే ఇష్టపడం ఎందుచేతనంటే మనలో ఏ సద్వస్తువు

అయితే ఉందో దానికి మరణం లేదు. ఆ మరణం లేని వస్తువు మనమై ఉన్నాము. అది మనమై ఉన్నాము కాబట్టి మరణం వస్తే మనం అంగీకరించము. మనకి వుండాలని ఎందుకు ఉంది? ఆ సద్వస్తువు దేహం పోయిన తరువాత కూడా ఉంటుంది. ఆ ఉండేదే మనమై ఉన్నాము కాబట్టి మనకి వుండాలని ఉంటుంది. శరీరం పోయిన తరువాత కూడా మనం వుంటాము అన్నది శరీరం ఉండగానే మనకి అనుభవంలోకి వస్తే శరీరం ఉన్నా, శరీరం పోయినా మనకు ఏమీ అనిపించదు. రామకృష్ణ పరమహంసగారు చెప్పారు ఇవాళ పగలకి రేపు పగలకి ఈ రాత్రి ఎటువంటిదో ఈ జన్మకీ రాబోయే జన్మకీ మరణం అటువంటిది. చనిపోవటం మళ్ళీ పుట్టటం అంటే ఒక గదిలోంచి ఇంకో గదిలోకి వెళ్ళటం అని చెప్పారు.

మహాత్ముల దర్శనం వలన, మహర్షులతోటి సాంగత్యం వలన మనం ఎంతోకొంత లాభం పొందుతాము. ఆ వస్తువుకి సంబంధించిన రీలైజేషన్ వాడికి రాకపోయినా హృదయంలో ఏదో వుంది అని తెలుస్తుంది. అక్కడి నుంచి దానికోసం ప్రయత్నం ప్రారంభిస్తాడు. మన హృదయంలో ఏదో వుంది దానిని తెలుసుకోవాలనే కాంక్ష మహాత్ముల సమక్షంలో మనకి వచ్చింది. అందుచేత మహాత్ముల దర్శనం యొక్క లాభం అది. మహాత్ముల యొక్క దర్శనం చేయటం వల్ల భౌతికంగా అయినా, ఆధ్యాత్మికంగా అయినా ఏదో రకమైన లాభం పొందకుండా ఆ జీవుడు బయటకు వెళ్ళడు. రమణమహర్షిగారు ఏమన్నారు అంటే నీకు ఎప్పుడైనా సత్యవస్తువులోపల వున్నట్టు స్ఫురించినా అది నిలబడదు. వాసనాక్షయం అయ్యాక నీకు కలిగిన జ్ఞానాన్ని నమ్మాలికాని ఈ లోపులో నమ్మటానికి వీలులేదు. వాసన ఉన్నంతకాలం నీకు ఆ వస్తువుని అనుభవంలో వుండనివ్వదు. వాసన అంటే ఫలకాంక్షతోటి మనం ఏదో పని చేస్తాము. ఫలితం వస్తుంది. ఫలితాన్ని మనం ఎంజాయ్ చేస్తాము. ఎంజాయ్ చేసినప్పుడు వచ్చే భావన వాసన కింద వుండిపోతుంది. మళ్ళీ ఆ వాసనలోంచి తలంపు వస్తుంది. తలంపులోంచి మాటవస్తుంది. తలంపులోంచి పని చేస్తాము. మనం తిన్న తిండిని బట్టే తేనుపు వస్తుంది. అలాగే వాడు చేసిన పనిని బట్టి వాసన వస్తుంది. ఇదే సంసారం అంటే. భర్త పిల్లలు సంసారం కాదు. వాసనాక్షయం అయ్యేవరకు మిమ్మల్ని మీరు నమ్మవద్దు. మీకు వచ్చిన అనుభవాన్ని వాసన స్థిరంగా వుండనివ్వదు. కానీ ఒకసారి అనుభవం పొందారు కాబట్టి మనం ఎక్కడ పతనం అవుతున్నామో అది తెలుస్తూ ఉంటుంది.

అలవాట్లయొక్క వేగం చాలా తీవ్రంగా ఉంటుంది. ఆ వాసన పోగొట్టుకోవాలంటే గురువు దయ ఉండాలి.

డబ్బు, చదువు, అధికారం ఇవన్నీ చెడ్డవి కాదు. చదువు, ధనం ఉండవచ్చు వాటితో తాదాత్మ్యం చెందకూడదు. చదువు, ధనం వలన మనకి అహంకారం పెరగకుండా చూచుకోవాలి. వాటిని దుర్వినియోగం చేసుకుంటే చెడ్డలోకాలకి వెళ్ళాలి. వాటిని సద్వినియోగం చేసుకుంటే పుణ్యలోకాలకి వెళ్ళటానికి అవి సహకరిస్తాయి. నువ్వు పుణ్యం చేస్తే ఆ పుణ్యం నీకు జ్ఞానానికి పెట్టుబడిగా ఉపయోగపడుతుంది. మంచి పనులు చేయటం వలన చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి అనే గేటు ద్వారానే మనం మోక్షానికి వెళ్ళాలికాని ఇంకో మార్గం లేదు. విభూతి అంటే ఐశ్వర్యం. లోకంలో ఉన్న ఐశ్వర్యం అంతా ఈశ్వరుడిదే. నీకు ధనం వచ్చినా, గౌరవం వచ్చినా, అధికారం వచ్చినా, చదువు వచ్చినా ఇదంతా భగవంతుడు ప్రసాదించినదే. నీదంటూ ఏమీ లేదు. అది ఒక గిఫ్ట్ అంతే. భగవంతుడి సంకల్పం లేకుండా ఏదీ మనకు రాదు. భగవంతుడు ఒకోసారి నీకు మంచి అవకాశాలు ఇస్తాడు. ఆ అవకాశాలను నువ్వు సద్వినియోగం చేసుకుంటే ఇంకా మంచి జన్మలు ఇస్తాడు. అవకాశాలు కనుక నువ్వు దుర్వినియోగం చేసుకుంటే నీకు చెడ్డ జన్మలు వస్తాయి. మరణించిన తరువాత చీకటిలోకాలకి వెళ్ళాలి. ఒక తాతగారు వాళ్ళ మనవడికి ఐదు రూపాయలు ఇచ్చారు. మనవడు ఐదు రూపాయ లో ఒక రూపాయి మళ్ళీ తిరిగి తాతగారికి ఇచ్చి అందరితోటి మా తాతయ్యకు రూపాయి ఇచ్చాను అనేవాడు. ఆ రూపాయి ఎవరిది? తాతయ్యదే. తాతయ్యది తాతయ్యకే ఇచ్చి, నేను ఇచ్చాను అనేవాడు. మనం చేసే దానధర్మాలు కూడా ఇలాగే ఉన్నాయి. సొమ్ము ఎవరిది? ఈశ్వరుడిది. ఆయనది ఆయనకే ఇచ్చి మనం ఇచ్చాము అనుకుంటున్నాము. మనకి ఐశ్వర్యం ఇచ్చేవాడు ఈశ్వరుడు, తీసుకునేవాడు ఈశ్వరుడు.

కర్తలేని కర్మ చేసేవాడు ఈ లోకంలో బుద్ధిమంతుడు అని పరమాత్మ చెప్పాడు. కర్తృత్వం వల్ల మనకి దుఃఖం వస్తుంది. ఈ పని నేను చేసాను అనే తలంపు వల్ల దుఃఖం వస్తుంది. కర్తృత్వం లేకుండా, నువ్వు పని చేస్తే నీకు దుఃఖ స్పర్శ కూడా రాదు. అహంభావన లేకుండా పనిచేస్తే అది నిన్ను బంధించదు. మనకి వచ్చే భావన వెనకాల అహంభావన

ఉందో లేదో మనం చూచుకోవాలి. తలంపు వచ్చాక మనం పనిచేస్తాము. మన తలంపు వెనుక అహంభావన ఉంటే మనం పతనమవుతాము. చిత్తశుద్ధి లేకుండా మనస్సు అంతర్ముఖం అవ్వదు. మనస్సు అంతర్ముఖం అవ్వకుండా ఆత్మాకారం చెందదు. అది ఆత్మాకారం చెందకుండా నీకు ఆత్మజ్ఞానం రాదు. ఆత్మజ్ఞానం అన్నా, మోక్షం అన్నా, నిర్వాణ స్థితి అన్నా ఒకటే. అహంభావన లేనివాడికి ఆత్మజ్ఞానం వస్తుందికాని, అహంభావన ఉన్న వాడికి ఆత్మజ్ఞానం కలుగదు.

**న కర్తృత్వం నకర్మాణి లోకస్య సృజతి ప్రభుః**

**న కర్మఫల సంయోగం స్వభావస్తు ప్రవర్తతే (5-14)**

నేను చేసాను అనే భావన మీ స్వభావం వలన, ప్రకృతి వలన వస్తోందికాని ఈ లోకంలో కర్తృత్వమునుకాని, కర్మలనుకాని, కర్మఫలముతోటి సంబంధముగాని నేను కల్పించలేదు అంటున్నాడు పరమాత్మ. ఎవడి స్వభావాన్నిబట్టి వాడు పని చేస్తున్నాడు. రకరకాల కర్మలు చేసుకుంటున్నారు. నీ అలవాట్లని బట్టే స్వభావం ఏర్పడుతుంది. నీ అలవాట్లని బట్టే నువ్వు చేసుకుంటున్నావు కాని ఆ పని చెయ్యమని నీకు నేనేమీ కల్పించలేదు. ఈ పని నేను చేసాను అనే పొగరుబోతుతనం కూడా నేను నీకు కల్పించటంలేదు. ఇది అంతా నీ స్వభావాన్ని బట్టి, పూర్వజన్మల వాసనలనిబట్టి, సంస్కారాలనిబట్టి నువ్వు చేసుకుపోతున్నావు. ఇవన్నీ నువ్వు కల్పించుకున్నవి, ప్రకృతి కల్పించినవి నాకు వీటితో ఏమీ సంబంధం లేదు. అందుచేత నీ స్వభావాన్ని మార్చుకోవాలి, నీ అలవాట్లయొక్క వేగాన్ని తగ్గించుకోవాలి. ఎందుకు మార్చుకోవాలి? మంచి కర్మలు ఎందుకు చెయ్యాలి? చెడ్డ కర్మలు ఎందుకు చెయ్యకూడదు? మనో నిగ్రహం ఎందుకు? ఇవన్నీ భగవంతుడిని పొందటంకోసం ఈ నియమాలు అవసరం. ఒక క్రమశిక్షణ లేకుండా, ఒక నియమ బద్ధమైన జీవితం లేకుండా నువ్వు భగవంతుడిని పొందలేవు అని చెప్పాడు.

చాలామంది ఇంట్లో ధనం ఉన్నా మనస్సులో దారిద్ర్యంగా ఉంటారు. మోక్షం పొందటానికి మనస్సులో ఉన్న దారిద్ర్యం అడ్డువస్తుంది కాని ఇంట్లో ఉన్న దారిద్ర్యం మోక్షం పొందటానికి అడ్డురాదు. మన ఇంట్లో దారిద్ర్యం వలన మనం ఇతరులకు ఏమీ ఇవ్వలేక పోయినా వాళ్ళు శాంతిగా ఉండాలి, సుఖంగా ఉండాలి అని వాళ్ళ క్షేమం కోరుకోవటంలో

దారిద్ర్యం పనికిరాదు. మీ మనస్సు సంస్కరింపబడినది అయితే నిగ్రహింపబడిన మనస్సు అయితే, నీ మనస్సుకి అర్హత ఉంటే అప్పుడు ఇతరుల క్షేమం నువ్వు కోరతావు. ఇతరులందరూ సుఖంగా ఉండాలి అని నువ్వు కోరితే నీ వైబ్రేషన్స్ వాళ్ళకి పనిచేస్తాయి. అది వాళ్ళకి ఉపకారం. నీకు ఉపకారం ఏమిటిఅంటే నువ్వు ఎవరి క్షేమం కోరుతున్నావో వాళ్ళు బాగుపడినా, బాగుపడకపోయినా నీకు బ్రహ్మానుభవం పొందటానికి అర్హత వస్తుంది. మనస్సులో ఉన్న దారిద్ర్యం వల్లే నీకు చీకటిలోకాలు వస్తాయి. అందుచేత మనస్సులో దారిద్ర్యం పనికిరాదు. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు. లేనిదానికి ఉండటం అంటూ లేదు అన్నాడు పరమాత్మ. మనం ఉన్నదానిని లేదు అనుకుంటున్నాము. లేనిదానిని ఉంది అనుకుంటున్నాము. బుద్ధిమంతులనుకూడా ఒకోసారి చెడ్డవాళ్ళు అనుకుంటాం. చెడ్డవాళ్ళని ఒకోసారి మంచివాళ్ళు అనుకుంటాం. అంటే మనకి సరియైన అవగాహన లేదు. ముందు నీ మనస్సులో ఉన్న బలహీనత ఏమిటో నువ్వు చూసుకో. మీకు ఎవరిమీద అయినా ద్వేషం వస్తోంది అనుకోండి అదొక బలహీనత. మీరు మనస్సుని స్కేనింగు చెయ్యాలి. స్కేనింగు చేసి మారుమూలన ఉన్న బలహీనతలు ఏమిటో పరిశీలనచేసి తెలుసుకోవాలి. రోగం తెలిసిన తరువాత రోగనివారణకి ప్రయత్నం చెయ్యాలి. అలాగే నీ బలహీనత తెలిసినతరువాత, ఆ బలహీనత లేని వాళ్ళతోటి నువ్వు స్నేహం చేస్తే ఆ బలహీనత తొందరగా పోతుంది. అందుకే సజ్జనసాంగత్యం చెప్పారు. మన హృదయంలో ఉన్న సద్వస్తువుతోటి మనం కలిసి ఉండలేకపోతున్నాము అనుకోండి, బయట ఉన్న సత్పురుషులతోటి స్నేహం చెయ్యవచ్చు. ఆ సత్పురుషులు కూడా దొరకటంలేదు అనుకోండి, సద్గ్రంథాల పారాయణం చెయ్యాలి. మీరు నిద్రపోయేముందు ఒక పవిత్ర గ్రంథం ఒక గంట అధ్యయనం చేసుకుంటే దాని ప్రభావం వలన రాత్రి అంతా నీకు సాధన జరుగుతుంది. మరణించే టైములో మీకు నా స్మరణ ఉంటే మీరు మంచి స్థితిని పొందుతారు అని గీతలో పరమాత్మ చెప్పాడు. సందేహాలు పెట్టుకోవద్దు. భగవంతుడిపట్ల మనకి నూటికి నూరు పాళ్ళు విశ్వాసం ఉంటే సందేహాలు పోతాయి. స్థిరబుద్ధి కలుగుతుంది. ఆయన పట్ల శరణాగతి వస్తుంది. పూర్ణశరణాగతి వలన కూడా మనకి మోక్షం వస్తుంది. కంటిలో నలుసు, కాలిలో ముల్లు ఎటువంటివో సందేహాలు కూడా అటువంటివే. అందుచేత నువ్వు సందేహాలు పెట్టుకోవద్దు. మనం విశ్వాసహీనులు అవ్వకూడదు.

హృదయంలో సత్యవస్తువు లేకపోతే అది రమణుడికి అనుభవంలోనికి రాదు, రామకృష్ణుడికి అనుభవంలోనికి రాదు. ఆత్మజ్ఞానం మనకి లేకపోవచ్చు కానీ ఉన్న వాళ్ళని చూస్తున్నాము కదా. హిందూధర్మాన్ని బట్టి కొంతమంది అలా జీవిస్తున్నారు. అందుచేత హిందూమతం జీవనది అయ్యింది. భగవద్గీతలో గుణాతీతలక్షణాలు చెప్పాడు, జీవన్ముక్త లక్షణాలు చెప్పాడు. ఆ జీవన్ముక్తస్థితి పొందినవారిలో కంచిపరమాచార్యులు ఉన్నారు? ఆయనకి తపస్సు ఉంది, విద్య ఉంది, అనుభవం ఉంది. అనుభవం ఉండటం వలన ఆయన జీవన్ముక్తుడు అయ్యాడు. పరమాచార్య 100 సం॥లు జీవించారు. ఆయన గొప్ప ఆహార నియమం గలవారు. ఆహార నియమంలో ఆయన్ని మనం ఆదర్శంగా పెట్టుకోవాలి. ఇప్పుడు కొంతమంది ఉపనిషత్తులు చెబుతున్నారు. అది డ్రైగా ఉంటోంది. ఎందుచేతనంటే వాళ్ళకి తపస్సులేదు. పరమాచార్య మాట్లాడుతూ ఉంటే మీ చెవిలో రహస్యం చెప్పినట్టు ఉంటుంది. అంత నెమ్మదిగా, స్థిరంగా మాట్లాడతారు. ఆయన మాట్లాడిన ప్రతీ మాటకీ శాస్త్రాన్ని ప్రమాణంగా చూపిస్తారు. మీకు ఎంతవరకూ అర్థమవుతోంది, మీరు ఎంతవరకూ బాగుపడు తున్నారు అని చూచుకుంటూ ఉంటారు. కానీ ఆయన గురించి మీరేమనుకుంటున్నారో, చప్పట్లు కొడుతున్నారా, లేదా అవేమీ ఆయనకు అక్కరలేదు. ఆయన పరమాచార్య.

ఈ లోకం మంచిదా, చెడ్డదా అని ఒకరు రమణమహర్షిగారిని అడిగారు. లోకం మంచిదీకాదు, చెడ్డదీకాదు అన్నారు. మనం హాస్పటల్‌కి వెళ్ళి స్కేనింగు తీయించుకుంటే అది జబ్బు ఉందో లేదో చెబుతుంది కాని స్కేనింగు మనకి వైద్యం చేయదు. అలాగే ప్రపంచం కూడా స్కేనింగు మిషనులాంటిది. మీలో ఉన్న బలహీనతలు ఏమిటో ప్రపంచాన్నిబట్టి మీకు తెలుస్తూ ఉంటుంది కాని ఆ లోపాలు ప్రపంచం తీయదు. నువ్వు ప్రయత్నంచేసి, సజ్జన సాంగత్యం చేసి, శాస్త్రం ఆధారంగా తీసుకొని జీవిస్తూ నీకున్న బలహీనతలను నువ్వే తొలగించుకోవాలి. ప్రపంచంలో మనం బాగుపడటానికి భగవంతుడు ఒక అవకాశం ఇచ్చాడు. ఈ అవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకుంటే మనకి ఈ జన్మలో మోక్షం రాకపోయినా, మళ్ళీ జన్మ మనకి సాధన బాగా జరిగే జన్మని పరమాత్మ ఇస్తాడు. అంతఃకరణము అంటే లోపల పనిముట్టు. నీ శరీరాన్ని ఎంత శుచిగా ఉంచుకుంటున్నావో అలాగే నీలోపల ఉన్న పనిముట్టుని (మనస్సు) కూడా అంతశుచిగా ఉంచుకో. నీ అంతఃకరణం

శుద్ధిగా ఉంటే హృదయంలో ఉన్న ఈశ్వరుడు నీకు అనుభవంలోనికి వస్తాడు.

**కామక్రోధవియుక్తాం యతీనాం యతచేతసామ్,**

**అభిలో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్ (5-26)**

కామక్రోధములు లేనివారు, మనోనిగ్రహము కలవారును, ఆత్మతత్త్వము తెలిసినవారు నగు ప్రయత్నశీలురకు మోక్షము ఎల్లపుడు భాసిల్లుచుండును. మానవుడికి పొరపాట్లు చేయటం ఇష్టంలేకపోయినా పొరపాటు చేయటానికి కారణం కామక్రోధాలు అని భగవంతుడు చెప్పాడు. కామక్రోధాలు ఉన్నంతసేపు నువ్వు మంచిగా ఉండాలన్నా ఉండలేవు, జ్ఞానాన్ని నిరోధించే పనులు కూడా నువ్వు చేస్తూ ఉంటావు. ఒకసారి పరమాచార్యులవారిని దుర్వాసమహర్షికి కోపం ఎక్కువకదా అని ఒకరు అడిగారు. ఆయనకి కోపం ఎక్కువ అని నువ్వు అంటున్నావు. ఆయనకి ఎక్కడా కోరికలేదు అది చెప్పటం మానేసి ఇది చెబుతున్నావేమిటి అన్నారు. అంటే మన బుద్ధి శుభ్రంగా పాడైపోయివుంది. మనం ఎదుటివాళ్లలో చెడ్డ తీసుకుంటాం, వాళ్లలో మంచిని వదిలేస్తాము. అలాకాదు మనం ఎదుటివారిలో మంచిని స్వీకరించి, చెడ్డని వదిలివేస్తూ ఉండాలి ఇది మన జీవితంలో ముఖ్యంగా నేర్చుకోవాలి. మన శరీరం మరణించేలోపు కామక్రోధాల్లోంచి విడుదల పొందాలి. మీకు కోరిక వచ్చిందనుకోండి అది ఒక ఉద్రేకం. మీకు కోపం వచ్చిందనుకోండి అదొక ఉద్రేకం. నీకు కోరిక, కోపము వచ్చినప్పుడు నీ శరీరము, మనస్సు కూడా ఉద్రేకపడతాయి. ఏ సాధకుడు అయితే కామక్రోధాల్లోంచి విడుదలపొంది ఆత్మయొక్క వైభవాన్ని అనుభవం లోనికి తెచ్చుకుంటున్నాడో వాడికి శరీరం ఉంటే ఆనందం, శరీరం పోతే ఆనందం, లోకం కనిపిస్తే ఆనందం, లోకం కనపడకపోతే ఆనందం. వాడికి అదృష్టం వెంటాడుతూ ఉంటే ఆనందం, దురదృష్టం వెంటాడుతూ ఉంటే ఆనందం. ఎటుచూచినా ఆనందమే. ఎటు చూచినా సుఖమే, ఎటుచూచినా శాంతే. అది ఆత్మ యొక్క వైభవం. మీ శరీరం పోతూ ఉంటే ఏదో పోతోంది అని మనకి అనిపించదు. ఎందుచేతనంటే ఆ శరీరం నాదికాదు అని వాడికి తెలుస్తుంది. ఇది నాది అన్నచోట మీకు ప్రీతి వస్తుంది. ఇది నాది కాదు అని తెలిసినప్పుడు మీకు ప్రీతిరాదు. మీ శరీరం ఉండగానే, బ్రాహ్మీస్థితి పొందితే మంచిదే కాని ఇప్పుడు ఆ స్థితి లేకపోతే మీ శరీరం చనిపోయే రోజుకైనా ఆ స్థితిని పొందాలి. అంటే నూటికి నూరుపాళ్ళు దేహంతోటి సంబంధం లేకుండా, లోకంతోటి సంబంధం లేకుండా,

నామరూపాలతోటి సంబంధంలేకుండా అదృష్టాలు, దురదృష్టాలతోటి సంబంధం లేకుండా, కర్మఫలితాలతోటి సంబంధం లేకుండా ఎవడైతే శాంతిలో కూరుకుపోయాడో వాడు ఆ లోకానికి, ఈ లోకానికి ప్రయాణం చేయవలసిన అవసరంలేదు. వాళ్లకి గోయింగ్ ఆగిపోతుంది, కమింగ్ ఆగిపోతుంది.

మరణానంతరం ఇతరలోకాలు ఉన్నాయా అని ఒకరు గౌతమబుద్ధుడిని అడిగారు. ఆ లోకాలు ఉన్నాయి అని అంగీకరించి ఊరుకోలేదు, శరీరం మరణించిన తరువాత ఏ జీవుడు అయితే ప్రయాణం చేస్తున్నాడో ఆ జీవుడు ఎంత నిజమో, ఆ లోకాలు కూడా అంతే నిజం. ఇవన్నీ వ్యవహారికసత్యాలే కాని పారమార్థికసత్యాలు కాదు. పారమార్థిక సత్యం నీ హృదయంలోనే ఉంది అన్నారు. నీ హృదయంలో ఉన్న బంగారాన్ని వదిలేసుకొని రోడ్డు మీద ఉన్న గాజుపెంకులకోసం తిరుగుతున్నావు అని రమణమహర్షిగారు అనేవారు. కొంతమంది ఇంటి దగ్గర పరిస్థితులతోటి కలవరు. అలాగని వాళ్లతోటి విరోధం పెట్టుకోరు. వాళ్ల ప్రారబ్ధం వాళ్లది, మన ప్రారబ్ధం మనది అనుకుంటారు. రావణాసురుడు భార్య అలా నటించేది కాని రావణాసురుడి గుణాలు ఆమె ఎప్పుడూ తెచ్చుకోలేదు. అలాగే వాలి భార్య కూడా వాలికి మంచి చెప్పేది. వాడి ప్రారబ్ధంలో ఉన్నది తప్పదు. మనం మంచి చెప్పాలి. వాళ్ళు విన్నా వినకపోయినా మన డ్యూటీ మనం చెయ్యాలి. వాళ్ల ప్రారబ్ధం బలీయంగా ఉన్నప్పుడు మనం చేసేది ఏమీ లేదు. మన ప్రారబ్ధాన్ని బట్టి భగవంతుడు ఈ దేహాన్ని ఎప్పుడు ఎక్కడ వుంచాలో అక్కడ వుంచుతాడు. మనం తల్లిగర్భంలో వుండగానే మన సినిమాలు తీసేసారు. మన జీవితాలు అన్నీ తీయబడ్డ సినిమాలే. ప్రారబ్ధాన్ని బట్టి శరీరం ఆడుతూ ఉంటుంది. ప్రారబ్ధాన్ని బట్టి శరీరం ఆడేటప్పుడు సాధన ఎందుకు? అని ఒకరు భగవాన్‌ని అడిగారు. నీకు సాధన ఎందుకు అంటే ఏదైతే ప్రారబ్ధం అనుభవిస్తోందో అది నువ్వు కాదన్న సంగతి నీకు అనుభవంలోకి రావాలి, దానికే సాధన. అప్పుడు ప్రారబ్ధం ఎటువంటిదైనా నీకు బాధరాదు. ప్రారబ్ధాన్ని బట్టి దేహం పని చేసి ప్రారబ్ధం పూర్తి అయిన తరువాత ఆ దేహం చనిపోతుంది. సాధన వలన ఆ దేహంతోటి తాదాత్మ్యం నీకు విడిపోతుంది. అప్పుడు నీకు సంతోషం వస్తే ఏదో వచ్చింది అని నీకు అనిపించదు. దుఃఖం వచ్చినప్పుడు ఏదో పోయింది అని నీకు అనిపించదు. ప్రారబ్ధం నేను అనుభవిస్తున్నాను అని నీకు ఏమీ ఉండదు. అది నువ్వు

సాధన చేయటం వలన వచ్చిన లాభం. కొంతమందికి ఎంతవున్నా శాంతి ఉండదు, సంతృప్తి ఉండదు. శాంతచిత్తము కలవాడు ఈ లోకంలో అదృష్టవంతుడు. శాంతచిత్తము కలవాడు దేహ ప్రారబ్ధాన్ని బట్టి కష్టాలు వచ్చినా, సుఖాలు వచ్చినా ఏమీ లోపలకు తీసుకోడు. వాడు పరమాత్మలో స్థిరంగా ఉంటాడుగాని ఏమీ లోపలకు తీసుకోడు.

తుకారామ్ ఏమన్నాడు అంటే ఓ రంగా! ఓ పాండురంగా! నీ చేతిలో నేను ఓడిపోలేదు, నా చేతిలో నువ్వే ఓడిపోయావు అన్నాడు. ప్రపంచంలో ఎన్ని కష్టాలు ఉన్నాయో, ఎన్ని దుఃఖాలు ఉన్నాయో, ఎన్ని దురదృష్టాలు ఉన్నాయో అన్నీ నాకు పంపేసావు. కానీ నువ్వు పంపే కష్టాలు, నువ్వు పంపే దురదృష్టాలు నావంటిమీద ఈగలు వాలినట్టు కూడా లేవు. అవి నా శాంతచిత్తాన్ని చెదరగొట్టలేదు. ఎందుచేతనంటే నేను పరమాత్మతో ఏకంగా ఉన్నాను అన్నాడు. తుకారామ్ వ్యాపారం చేసి, వ్యవసాయం చేసి చేతకాని పనులన్నీ చేసి అంతా తగులబెట్టాడు. అందుకు తుకారామ్ భార్య ఒకోసారి కొట్టేది. తెలియక పిల్లలు కూడా కొట్టేసేవారు. అన్ని బాధలు పెట్టినా భార్యమీద తుకారామ్‌కి కోపం లేదు. ఆవిడ మీద మనస్సులో విరోధం పెట్టుకోలేదు. తుకారామ్ ఎంత గొప్పవాడు అంటే తుకారామ్‌ని తీసుకు వెళ్ళటానికి వైకుంఠం నుంచి విమానం వచ్చింది. భార్య అంత హింసపెట్టినా తుకారామ్ మనస్సులో ఎక్కడా విరోధం లేకుండా విమానం వచ్చింది నువ్వు కూడా వచ్చేయి అన్నాడు. ఎక్కడికి అంది. వైకుంఠానికి అన్నాడు. వైకుంఠం అంటే ఏదో విశాఖపట్నం అనుకుంది. అప్పుడు ఆవిడ మజ్జిగ చేసుకుంటోంది. నా చేతిలో ఉన్న పని వదిలేసి నేను ఎందుకు వస్తాను. నేను రాను అంది. విమానం వెళ్ళిపోయింది. వైకుంఠం అంటే ఒక ఊరిపేరు అనుకుంది కాని మహావిష్ణువు ఉండే ప్లేసు అని ఆవిడకు తొయ్యలేదు. ఆవిడని తీసుకువెళ్ళటం నారాయణుడికి ఇష్టం లేదు అందుచేత భగవంతుడు తొయ్యనివ్వడు. వైకుంఠాన్నుంచి విమానం వచ్చి తుకారామ్‌ని తీసుకువెళ్ళింది. వాడు పరమపవిత్రుడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-02-2012, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ రోజు శివరాత్రి. శివుడు లింగరూపంలో అవతరించిన రోజు. మూడు కాలాల్లో, మూడు అవస్థలలో మన ఆధ్యాత్మిక హృదయంలో ఏ వస్తువు అయితే స్వయంగా ప్రకాశిస్తుందో

అదే శివుడు, మనలో ఉన్న చైతన్యమే శివుడు. శివరాత్రి రోజున పగలు ఉపవాసం చేస్తారు, రాత్రి జాగరణ చేస్తారు. ఉప అంటే దగ్గరగా, వాసం అంటే నివశించటం అంటే ఆత్మరూపంలో ఉన్న శివుడికి దగ్గరగా నివశించటం. జాగరణ అంటే ఏవో కాలక్షేపం మాటలు చెప్పకొంటూ, సినిమాలు చూస్తూ రాత్రి గడపటం కాదు. భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు. రాత్రి నిద్ర పోకుండా ఆయన స్మరణలో గడపటం జాగరణ. రమణమహర్షిగారు ఏమన్నారు అంటే అసలు తినకపోతే మనస్సు అన్నం మీదకు పోతుంది, ఏమీ తినకుండా కూర్చొని అన్నాన్ని ధ్యానం చేయటంకంటే కొద్దిగా తిని శివుడిని ధ్యానం చేసుకోండి అని చెప్పారు. భగవంతుడు నిరాకారుడు, నిర్గుణుడు ఆకారంలేనివాడు మనకోసం ఆకారం ధరించి వచ్చాడు. శివుడు అంటే శుభకరుడు, మంగళప్రదుడు. ఆయనను స్మరించటం వలన మనం పవిత్రులం అవుతాము. సర్వసాధారణంగా దేవతలందరూ కూడా పట్టు వస్త్రాలు వేసుకొని మనకు కనిపిస్తూ ఉంటారు కాని శివుడు మటుకు పులి చర్మం ధరించి ఉంటాడు. అంటే వేషంలో కూడా ఆడంబరం లేదు, ఆయన నిరాడంబరుడు, నిరహంకారుడు.

నారదుడు వాల్మీకిమహర్షి దగ్గరకు వచ్చినప్పుడు ఆయనతో వాల్మీకిమహర్షి 16 మహాగుణాల గురించి చెప్పి ఈ గుణాలు కలవాడు ప్రస్తుతం భూమిమీద ఎవడైనా ఉన్నాడా అని నారదుడిని అడిగాడు. ఈ 16 గుణాలు వీటికి అతీతంగా యింకా ఎక్కువ మంచి గుణాలు ఉన్నవాడు ఈ భూమి మీద ఉన్నాడు. ఆయనే దశరధుడి కుమారుడు శ్రీరాముడు అని చెపుతూ రామచంద్రమూర్తి యొక్క కళ్యాణగుణాలగురించి నారదుడు వాల్మీకికి చెప్పి రామకథ వ్రాయమని చెప్పాడు. వాల్మీకి రామాయణం వ్రాయకముందు భారత సాహిత్యం అంతా మంత్ర రూపంలో ఉండేది, మంత్రాన్ని శ్లోకరూపంలోనికి మార్చినవాడు వాల్మీకి. మొదటి కావ్యం రామాయణం, మొదటి కవి వాల్మీకి అందుచేత ఆయనను ఆదికవి అంటారు. మనం ఒకరూపం తోటి , పేరుతోటి తాదాత్మ్యం పొందుతున్నాము. నేను అది సాధించాను, ఇది సాధించాను అని కర్మతో తాదాత్మ్యం పొందుతాము. ఒకరూపంతోటి, నామంతోటి తాదాత్మ్యం పొందుతున్న మనం రూపం లేనివాడిని, పేరులేని వాడిని పట్టుకోలేము కాబట్టి మనకు సపోర్టుకోసం ఆయన లింగరూపం ధరించాడు. ఆ లింగాన్ని ఉపాసించటం వలన, ఆ లింగాన్ని ధ్యానించటం వలన మనం హృదయంలో లయమవుతాము. పగలు మనకు

శరీరం కనిపిస్తోంది, గుణాలు కనిపిస్తున్నాయి. రంగులు కనిపిస్తున్నాయి, ప్రపంచంలో ఉన్న విరోధాలు, స్నేహాలు, వికారాలు అన్నీ కనిపిస్తున్నాయి. రాత్రి మనం నిద్రపోయిన తరువాత ఇవన్నీ లయమయిపోతున్నాయి. అలా లయం చేసే వాడు శివుడు లేకపోతే అసలు మనకు నిద్రరాదు. రాత్రి పడుకొనేటప్పుడు లయకారకుడు అయిన శివుడిని స్మరించటం వలన మీకు ఏ కారణాలవలన మనస్సు బాహ్యాముఖమవుతోందో ఆ కారణాలను తొలగించి, మనస్సును అంతర్ముఖం చేసి మిమ్మల్ని నిద్రపుచ్చేవాడే శివుడు. శివస్మరణవలన నేచురల్‌గా మీ మనసస్సు హృదయంలో లయమైపోతుంది.

రామచంద్రమూర్తి మాయలేడి వెనకాల పరుగెట్టటం ఏమిటి? ఆయనకు మనం దేవుడు అని గుడులు కట్టిస్తున్నాము. అసలు బంగారపు లేడి ఉండదు కదా. ఆమాత్రం తెలియకుండా ఉంటే వాడు దేవుడా? ఒకవేళ సీత అడిగితే మటుకు అలా పరుగెట్టాలా అని కొంతమంది వాదిస్తూ ఉంటారు, వారికి మనం చెప్పలేము, దానిని దేహప్రారబ్దం అంటారు. భారతంలో కృష్ణుడు పాండవుల చేత అబద్ధాలు చెప్పించాడు. కృష్ణుడు మీకు అధర్మంగా నడిచినట్లు అనిపించవచ్చు కాని ధర్మాన్ని స్థాపించటానికి అక్కడ అధర్మంగా ప్రవర్తించాడు, అది మర్చిపోకండి. ఎవరైనా ఒకమాట మాట్లాడినప్పడు కాని, చేతితో ఒకపని చేసేటప్పడు కాని అక్కడ ఆ మనిషి హృదయం ఎలాఉంది అది మీరు చూడాలి. ఇప్పడు నేను మీతో మాట్లాడుతున్నాను కదా. ఆమాట మాట్లాడేటప్పడు ఏ ప్రేరణవలన ఆమాట నేను మాట్లాడుతున్నాను అది చూసుకోవాలి. రామకృష్ణపరమహంస చెప్పిన మాటలు, బుద్ధుడు చెప్పిన మాటలు మనం కూడా చెప్పవచ్చు కాని మనం చెప్పిన మాటలకు విలువ ఉండదు ఎందుచేతనంటే వారు జీవించి ఆమాటలు చెప్పారు. నువ్వు పవిత్రతలేకుండా, ఇతరుల క్షేమం కోరకుండా, లోపల అసూయపెట్టుకొని మాటలు చెపితే ఆ మాటలకు సమాజంలో ప్రాముఖ్యత ఉండదు. ఒక పవిత్రుడు మాట్లాడుతూ ఉంటే ఆ మాట దేశాలు దాటుతుంది, నదులు దాటుతుంది, సముద్రాలు దాటుతుంది, ఆ మంచి మాట ప్రపంచం అంతా ధ్వనిస్తుంది.

శివుడు జ్ఞానం యిస్తాడు అని చెపుతారు. జ్ఞానం అన్నా మోక్షం అన్నా ఒక్కటే, జ్ఞానం అంటే విషయజ్ఞానం కాదు. యింద్రియాల ద్వారా, మనస్సు ద్వారా, బుద్ధి ద్వారా మనం సంపాదిచేదంతా విషయజ్ఞానం. మనస్సు అంతర్ముఖం అవ్వటం వలన వచ్చేది

ఆత్మజ్ఞానం. యింద్రియాల ద్వారా, మనస్సు ద్వారా నువ్వు విషయాలను గ్రహించవచ్చు కాని వాటికి ఆధారంగా ఉన్న చైతన్యాన్ని నువ్వు గ్రహించలేవు. ఎక్కడయితే నీ యింద్రియాలు, మనస్సు, బుద్ధి అణిగిపోయినాయో అక్కడ చైతన్యం నీకు వ్యక్తమవుతుంది. నువ్వు కష్టపడి చదివి గ్రహించేదంతా విషయజ్ఞానమే దానివలన పొట్ట పోషించుకోవచ్చు కాని దానివలన ఆత్మజ్ఞానం రాదు. రామకృష్ణుడి ఇంటిదగ్గర పనిచేసే మనిషితో మహేంద్రనాథ్‌గుప్తా ఏమన్నాడు అంటే ఇక్కడ మీ గురువుగారికి చదువు ఏమీలేదు, సంతకం పెట్టటం కూడారాదంట కాని ఇక్కడ వచ్చినవాడికి శాస్త్రం చెపుతాడట ఎలా చెప్పతున్నాడు అని అడిగాడు. ఆవిడ చెప్పిన సమాధానం ఏమిటి అంటే విద్యాస్వరూపుడికి విద్య నేర్చుకోవటం ఎందుకు? మా గురువుగారి కంఠంలో మొత్తం విద్యలు అన్నీ ఉన్నాయి ఇంక ఆయనకు కాలేజీ చదువులు ఎందుకు? నువ్వు కాలేజీలో చదువుకున్నావని మా గురువుగారు కూడా చదువుకోవాలా? యిది ఒక పనిమనిషి మహేంద్రనాథ్‌గుప్తకు చెప్పిన సమాధానం.

మనం నేను నేను అంటాము కదా అది మిథ్యానేను, దేహగతమైననేను. నిజమైన నేను ఒకటి మన హృదయంలో ఉంది. దానిని అతీతమైననేను అన్నాడు రాధాకృష్ణన్. అది నీ శరీరానికి గాని, బుద్ధికి గాని, యింద్రియాలకు కాని, మనస్సుకు కాని అందదు. అది వీటి అన్నింటికి అతీతమైనది కాబట్టి దానికి అతీతమైన నేను అని పేరుపెట్టాడు. మిథ్యా నేను లయమైపోతే నిజమైననేను మనకు అనుభవంలోనికి వస్తుంది. నీకు జీవుడు ఉన్నాడు, దేవుడు ఉన్నాడు. ఈ జీవుడు దేవుడిని పట్టుకోలేకపోతున్నాడు. దీనికి ఎవరో ఇతరులుకాని, బంధువులు కాని, స్నేహితులు కాని, నీ సంపద కాని అడ్డురావటం లేదు, దేహగతమైననేనే అడ్డువస్తోంది. జ్ఞానం అంటే ఏమిటి అని బకింగ్‌చంద్రఛటర్జీ రామకృష్ణ పరమహంస గారిని అడిగాడు. ప్రతీ మనిషి నేను, నేను అంటాడు. ఆ నేను నూటికి నూరుపాళ్ళు అబద్ధం అయినా నీలో ఉన్న అజ్ఞానం వలన అది నిజం అనుకొంటున్నావు. ఆ నేను ఉన్నంతకాలం నువ్వు చీకటిలోనే ఉంటావు, తప్పలు చేయకుండా ఉండలేవు. ఇప్పుడు నువ్వు ఏదైతే నేను, నేను అంటున్నావో ఆనేను, నేను కాదని తెలిసినప్పడే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది కాని ఈలోపుగా నువ్వు ఎన్ని ప్రక్రియలు చేసినా, ఎన్ని మహిమలు చేసినా నీకు ఆత్మజ్ఞానం కలుగదు అన్నాడు రామకృష్ణుడు. ఇప్పడు ఏదైతే నువ్వు నేను నేను అంటున్నావో ఆ నేను

నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం అన్నారు. ఇక్కడ ఒక గోడ ఉంది అనుకో, గోడ అవతల ఉన్నవారు నాకు కనబడరు. వారు నాకు కనబడకుండా ఏది అడ్డు వస్తోంది, గోడే అడ్డు వస్తోంది. భగవంతుడు నీ హృదయంలోనే ఉన్నాడు. ఆయన నీకు కనబడకుండా నువ్వు చెప్పే నేను అడ్డు వస్తోంది. ఆ నేను అనే గోడను పడగొట్టగలిగితే ఇప్పుడు నేను నీతో ఎలా మాట్లాడుతున్నానో అలాగ నువ్వు దేవుడితో డైరెక్టుగా మాట్లాడవచ్చు, అలాగ త్యాగరాజు రాముడితో మాట్లాడాడు.

శివుడు స్మశాన వాసి. మీరు ఎన్ని బంగారపు వస్తువులు వేసుకొని, పట్టు వస్త్రాలు కట్టుకొని మీ సంపద అంతా సమాజం ముందు ప్రదర్శిస్తూ తిరిగినా మన శరీరాలు చివరకు వల్లకాటిలో బూడిద అవుతాయి. అది జ్ఞాపకం చేయటానికే శివుడు స్మశానవాసి అయ్యాడు. మీరు వంద అంతస్థుల మేడలో ఉండవచ్చు, కోట్లకు అధిపతి అవ్వవచ్చు కాని చివరకు మీ శరీరం బూడిద అవుతుంది. మీ శరీరంలో అన్నీ కాలిపోగా, కాలిపోగా చివరకు బూడిద మిగులుతుంది. అలాగే అన్నీ నాశనమైపోయినా చైతన్యం ఉంటుందని చెప్పటం. మనం వెళ్ళి ప్రసాదం అడిగితే బూడిదే పెడతాడు అంటే నీ జీవితం యొక్క పరిణామంలో ఇలా అవుతావు అని చెప్పటం. శివస్మరణ మంగళదాయకం, శుభదాయకం, నువ్వు గాఢనిద్రలో నిరాకారంగా ఉన్నావు, నిర్గుణంగా ఉన్నావు. కాని నువ్వు లేవా అంటే అక్కడ నువ్వు ఉన్నావు, అదే నిజమైన నేను, వాడే శివుడు. ఈ దేహానికి మనస్సుకు, గుణాలకు అతీతంగా ఏదో ఉందని రాత్రి నీకు గోచరిస్తోంది. పగలు దాని గురించి మనకు తెలియటంలేదు. ఎందుచేతనంటే మనకు దేహంతో ఉన్న తాదాత్మ్యం, మనరూపం, నామం, మన గుణాలు ఆ వస్తువు తెలియకుండా మనకు అడ్డు వస్తున్నాయి. నిర్గుణస్థితిలో, నిరాకార స్థితిలో అతీతమైన నేను మనకు తెలుస్తుంది కాని గుణాలు అన్నీ అడ్డువచ్చేటప్పుడు అది నీకు వ్యక్తం కాదు. అందుచేత మనం గుణరహితస్థితిని పొందాలి.

అన్నం తినేటప్పుడు, చదువుకొనేటప్పుడు మొహమాటపడకూడదు. అన్నం తినేటప్పుడు మొహమాటపడితే ఆకలితో బాధపడతావు. చదువుకొనేటప్పుడు సందేహాలు వస్తే టీచర్‌ను అడగకపోతే నువ్వు నష్టపోతావు. గురువును ఏదైనా విషయం గురించి అడిగేటప్పుడు తెలుసుకోవాలనే కాంక్షతో అడగాలి, వినయంగా అడగాలి, ఆడంబరం లేకుండా అడగాలి

అప్పుడు గురువుకు చెప్పాలనే బుద్ధి కలుగుతుంది. మనం ఒక దేహంతోటి, పేరుతోటి తాదాత్మ్యం పొందుతున్నాము కాబట్టి మన మనస్సు నిలబడటానికి ఈ గుడులు, గోపురాలు కల్పించుకొన్నాము. నీకు దేహబుద్ధి ఉన్నంతకాలం నువ్వు డైరెక్టుగా ఆత్మని ధ్యానం చేయలేవు. బయట ఉన్న దేవతా విగ్రహాలను ధ్యానం చేసి, అక్కడ భగవంతుడు ఉన్నాడు అనుకొని ఆ దేవతలను జపించి ఆ రకంగా తరించటానికి నువ్వు ప్రయత్నం చేస్తున్నావు. డైరెక్టుగా ఉన్న వస్తువును ఉన్నట్లుగా ఫేస్ చేయగలిగితే ఈ విగ్రహాలతో నీకు పనిలేదు. గురువు ఎట్లా లభిస్తాడు అంటే భగవంతుడిని తెలుసుకోవాలనే తపన నీకు నిజంగా ఉంటే, అది చూసి నీ హృదయంలో ఉన్న భగవంతుడే గురురూపంలో వస్తాడు అంటే మన లోపల ఉన్న చైతన్యమే కాళ్ళు చేతులు తొడుక్కొని నీలాంటి మనిషిగా వచ్చి నీకు కనిపిస్తాడు, వాడే గురువు. భగవంతుడు గురురూపంలో వచ్చినప్పుడు ఆయన మనలాంటి మనిషే అని మీరు అనుకోవచ్చు కాని ఆయన ఎవడో ఆయనకు తెలుసు. రామకృష్ణుడు చివరిటైములో కేన్సర్‌తో బాధపడతాడు. ఆయన శరీరం పడుతున్న బాధను చూసి నరేంద్రుడు ఈయన దేవుడా, దేవుడైతే ఇంత బాధపడతాడా అనుకొంటాడు. అప్పుడు రామకృష్ణుడు అంటాడు ఇప్పుడు కూడా సందేహిస్తున్నావా? నీ జీవితం పొడుగునా సందేహమేనా? ఈ దేహానికి కేన్సర్ వచ్చి బాధపడుతున్నాడు వీడు దేవుడు ఎలా అవుతాడు? అని అనుకొంటున్నావు. ఎవడైతే రాముడో, ఎవడైతే కృష్ణుడో వాడే ఈ రామకృష్ణుడు అంటాడు. అంటే ఆయన శరీరం కేన్సర్‌తో బాధపడుతున్నా ఆయన ఎవరో ఆయనకు తెలుసు.

అసలు గోల అంతా, గందరగోళం అంతా అహంకారంలోనే ఉంది. మనం కాని దేహంతోటి, మనంకాని మనస్సుతోటి, మనంకాని బంధువులతోటి, మనంకాని చావుపుట్టుకలతోటి తాదాత్మ్యం పొందేది ఈ అహంకారమే. ఈ అహంకారంలో నుండి విడుదల పొందేవరకు ఈ గోల అంతా నిన్ను విడిచిపెట్టదు. అహంకారంలోనుండి విడుదల పొందేవరకు ఆ జన్మకాజన్మ నిన్ను అజ్ఞానం వెంటాడుతుంది, చీకటి వెంటాడుతుంది. భగవంతుడు గురురూపంలో వచ్చినప్పుడు ఆ వేషమాత్రుడను తానుకాదని ఆయనకు తెలుస్తుంది. నువ్వు కూడా నీ వేషాన్ని తీసేసి నిన్ను నీవు చూసుకుంటే నీ హృదయంలో ఏ నిజమైతే ఉందో అది నీకు వ్యక్తమవుతుంది. బూర్లు, బూర్లు అంటే ఆ శబ్దం వినటంవలన నీకు సంతృప్తిలేదు, తింటే

వాటి రుచి తెలుస్తుంది, నీకు సంతృప్తి అవుతుంది. అలాగే మన హృదయంలో చైతన్యం ఉంది అని శ్రవణం చేస్తే సరిపోదు, దానిని అనుభవంలోనికి తెచ్చుకొంటే దాని తాలుక సుఖం, శాంతి నీకు తెలుస్తాయి. ఈ జీవితం అంతా స్వప్నసమానం అని అప్పుడు నీకు అర్థమవుతుంది. చావులు పుట్టుకలు అన్నీ అజ్ఞానం అనే చీకటిలో జరుగుతున్నాయి. చావు నిజం కాదు, పుట్టుక నిజం కాదు. స్వప్నంలో నుండి మెలుకువ వచ్చాక స్వప్నంలో జరిగిన విషయాలు అన్నీ అబద్ధం అని ఎలా తెలుస్తుందో అలాగే అజ్ఞానం అనే చీకటిలో నుండి బయటకు వచ్చినప్పుడు శరీరానికి సంబంధించిన చావుపుట్టుకలు అన్నీ అబద్ధమే, ఇది అంతా స్వప్నసమానం అని నీకు తెలుస్తుంది. శరీరం కూడా ఒక వేషం, నువ్వు ఎప్పుడైతే ఈ వేషం తీసేసావో, శరీరమే నేను అనే బుద్ధి ఎప్పుడయితే పోయిందో అప్పుడు నీలోపల ఉన్న నిజమైన గురువు నిన్ను లోపలకు గుంజుకొని ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. ఇప్పుడు నీ మనస్సు మెదడులో ఎంత సహజంగా ఉంటుందో అంత సహజంగా నీ లోపల ఉన్న ఆధ్యాత్మిక హృదయంలో మనస్సు ఉంటే అప్పుడు నీకు జ్ఞానోదయం అవుతుంది. అయితే మీరు చేయవలసింది ఏమిటి అంటే ఏకారణం వలన మనస్సు బాహ్యముఖమవుతోందో జాగ్రత్తగా చూసుకొని ఆ కారణాలను తొలగించుకోవాలి.

కోరికలు నెరవేరితే అందరికి సంతోషం, కోరికలు నెరవేరకపోతే దుఃఖం. కోరికలు నెరవేరినవాడు ఎంత నష్టపోతున్నాడో మనకు తెలియటంలేదు. కేన్సర్ జబ్బు ఉన్నవాడు లోపల కేన్సర్ ఉందని తెలిసే వరకూ సంతోషంగానే ఉంటాడు. అలాగే కోరికలు నెరవేరటం వలన లోపల వాసనలు, సంస్కారాలు, లోపల ఉన్న పెంట అంతా పెరిగిపోతోందని తెలియక వాడు సంతోషపడతాడు. నెరవేరిన కోరిక ఊరుకోదు ఇంకా అదనంగా కోరికలను తీసుకొని వస్తుంది. కోరికలను నెరవేర్చుకొంటూ కోరికలను జయించినవాడు ఇంతవరకు ఎవడూలేడు. కోరికను సంతృప్తి పరచటం కంటే, కోరికను జయించటం వలననే నీకు ఎక్కువ ఆనందం వస్తుంది. కోరికలను నిగ్రహించుకోవటం వలన నీకు వివేకం పెరుగుతుంది, నీ మనస్సు అంతర్ముఖమవుతుంది. నీ హృదయంలో ఉన్న సత్యం నీకు తెలియబడాలి అంటే నువ్వు బయట ఏవో జిమ్మిక్కులు చేయటం వలన, పైకి ఎగరటం వలన సత్యం తెలియబడదు, నువ్వు లోపలకు దిగాలి, నీ మనస్సు అణగాలి నీ హృదయంలో ఉన్న సత్యం ఎంతలోతులలో ఉందో అంత లోతులలోనికి నువ్వు దిగాలి. కొంత ప్రయత్నం చేసి వెనక్కి రాకూడదు. రామకృష్ణుడు ఏమని

చెప్పాడు అంటే నేను ఈ శరీరంలో ఎంతకాలం అయితే ఉంటానో అంతకాలం నేర్చుకొంటూనే ఉంటాను అని చెప్పాడు. ఆయనకు నేర్చుకోవటానికి ఏముంది. హృదయంలో ఉన్న సత్యం అనుభవం లోనికి వచ్చేవరకు ప్రయత్నం చేయమని చెప్పటం కోసం, మనకోసం అలా చెప్పాడు.

భగవంతుడు ఉన్నాడా, లేడా అని సందేహం పెట్టుకోవద్దు. భగవంతుడు ఉన్నాడనే సజీవమైన విశ్వాసం నీకు ఉంటే మీకు పాండిత్యం లేకపోయినా, చదువు లేకపోయినా, డబ్బులేకపోయినా మీ సాధనతో సంబంధం లేకుండా నూటికి యాభైమార్కులు వచ్చేస్తాయి, విశ్వాసానికి అంత బలం ఉంది. రమణమహర్షిగారికి బాహ్యగురువు లేడు. నీకు మెచ్యూరిటీ వచ్చినప్పుడు భగవంతుడు గురు రూపంలో రానక్కరలేదు, లోపల నుండే నీకు గైడెన్స్ వస్తూ ఉంటుంది. నువ్వు ఏదైనా పొరపాటు చేస్తూ ఉంటే ఇది పొరపాటు అని హృదయంలో నుండే నీకు చెబుతాడు. నీకు యోగ్యత లేనప్పుడు భగవంతుడు గురురూపంలో రావాలి కాని నీకు అర్హత, యోగ్యత ఉన్నప్పుడు ఆయన రూపం ధరించి రానక్కరలేదు. ఓ రామా! శ్రీరామా! ఈ తనువు తాను కాదని తెలిసినవాడికి జపమేల, తపమేల, సాధనఏల అంటాడు త్యాగరాజు. దేహబుద్ధి ఉన్నవాడికి, బుద్ధిలో దోషాలు ఉన్నవాడికి అవి పోగొట్టుకోవటానికి ఈ ఉపాసనలు కావాలి కాని దేహబుద్ధి లేనివాడికి వీటితో పనిఏముంది? రమణమహర్షిగారు త్యాగరాజు గురించి ఏమన్నారు అంటే ఆయన పాటలు పాడి ఏమీ పొందలేదు, పొందవలసింది పొందే పాటలు పాడారు అని చెప్పారు. మనం ఏ పని చేసినా కర్తృత్వం లేకుండా చేయాలి అంటే యిది నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చెయ్యాలి. నేను చేస్తున్నాను అనే భావనతో కనుక చేస్తే అది నిన్ను బంధిస్తుంది, అంటే పుణ్యానికి పుణ్యం, పాపానికి పాపం నువ్వు అనుభవించవలసిందే. కర్తృత్వం లేనివాడికి ఏమీలేదు. అక్షరమణమాలలో భగవాన్ ఏమన్నారు అంటే ఈ దేహం భౌతికమైన అగ్నికి ఆహుతి అవ్వకముందే నీ జ్ఞానాగ్నిని పంపించి నాలో పునర్జన్మ కారణాలను, దోషాలను బయటకు లాగి కాల్చి బూడిద చెయ్యి అన్నారు. పునర్జన్మ కారణాలు, బలహీనతలు మనలో చాలా ఉంటాయి. ఆ దోషాలు ఉన్నట్లు కూడా మనకు తెలియదు. మనలో ఆ దోషాలు ఉన్నట్లు మనకు తెలియకుండా వాటిని బయటకు లాగటానికి గురువుకు అవకాశం లేదు. అందుచేత ఆ దోషాలను కదిపి బయటకు లాగి అవి ఉన్నట్లుగా నీకు తెలియజేసి ఒక జన్మలో నువ్వు అనుభవించవలసిన దానిని ఒక గంటలో

నీచేత అనుభవింపచేసి దానిని బయటకు లాగి కాల్చేస్తాడు. వాడు గురువు. నీలో ఉన్న బలహీనతలను సహస్రారంలోనికి తీసుకొనివచ్చి నీచేత అనుభవింపచేసి, నిన్ను కొంత బాధకు గురిచేసాక వాటిని బయటకులాగి జ్ఞానాగ్నితో కాలుస్తాడు.

పెరుమాళ్ళు భగవాన్‌కు చాలాకాలం సేవచేసాడు. తరువాత భగవాన్‌ను తిట్టటం ప్రారంభించాడు. ఆయన ఇంక కొన్ని రోజులకు చనిపోతాడనగా గురువును మనం తిడుతున్నాము, మనం నరకానికి వెళ్ళిపోతాము అని భయం వేసింది. అప్పుడు భగవాన్ దగ్గరకు వచ్చి నేను చనిపోయే రోజులు దగ్గరకు వచ్చాయి, నరకానికి వెళ్ళిపోతానేమో అని భయంగా ఉంది అని చెప్పాడు. అప్పుడు భగవాన్ ఏమన్నారంటే ఓ పెరుమాళ్ళు! నువ్వు నాకు చేసిన సేవ, నాకు చేసిన మంచి గుర్తుపెట్టుకొన్నాను కాని నువ్వు చేసిన చెడ్డ గుర్తుపెట్టుకోలేదు. అందుచేత ఒకవేళ నువ్వు చెప్పినట్లుగా నువ్వు చేసిన పనులకు నరకానికి వెళతావు అనుకో. ఓ పెరుమాళ్ళు! నాకు నరకంలో పనిలేదు కాని నిన్ను రక్షించటానికి నేను నరకానికి వస్తాను అన్నారు, వాడు గురువు. నీలో దోషాల యొక్కరాశి, పాపపు రాశి ఎంత ఉన్నప్పటికి గురువు దగ్గర నుండి వచ్చే జ్ఞానాగ్ని వాటిని కాల్చేస్తుంది. గురువు అనుగ్రహ స్వరూపుడు. ఆయన ప్రేమించాలి అని నిన్ను ప్రేమించడు, ప్రేమించకుండా ఉండలేక ప్రేమిస్తాడు. చాకలివాడు బట్టలను రాయిమీద కొడతాడు. ఆ బట్టలను చింపేద్దామని రాయిమీద కొట్టడు, వాటిని శుభ్రం చెయ్యటానికి అలా చేస్తాడు. అలాగే ఒకోసారి గురువు నిన్ను బాధలకు గురిచేయవచ్చు. నిన్ను పవిత్రం చేయటానికే అలా చేస్తాడు కాని నిన్ను హింసపెట్టడానికి కాదు. నీకు బాధలు వచ్చినప్పడు గురువు నిన్ను విడిచిపెట్టేసాడు అని అనుకోవద్దు. గురువు యొక్క అనుగ్రహంలో పడినవాడు తరింపబడతాడు కాని అందులోనుండి తప్పించుకొనే అవకాశం లేదు. అదే పులినోటిలోపడ్డ మాంసపుముక్క.

శివుడికి లయకారకుడు అని ఎందుకు పేరు వచ్చింది అంటే విజృంభిస్తున్న మన మనస్సును లయం చేస్తాడు. అంతకంటే ఈ జీవితంలో మనకు ఏమి కావాలి. లయకారకుడు అంటే నిన్ను పాడుచేసేవాడు కాదు, నీలో ఉన్న చెడ్డను తీసేసేవాడు. గురువు ఏమి చేస్తాడు అంటే జీవితంలో నీకూడా ఉంటూ నువ్వు చెడుమార్గంలోనికి వెళ్ళకుండా నీ హృదయంలో నుండే ఆయన నీకు పాఠాలు చెపుతూ, గమ్యాన్ని చేరేవరకు నీ చెయ్యి పట్టుకొని నడిపిస్తూ

ఉంటాడు, వాడు గురువు. నీ ప్రారబ్ధం చెడుగా ఉంటే బాధకు గురి అవ్వకుండా, ప్రారబ్ధం మంచిగా ఉంటే ఉద్రేకపడకుండా సమానంగా ఉండేటట్లు నీకు శక్తిని ప్రసాదిస్తూ నువ్వు ఏదిగా ఉన్నావో ఆ వస్తువును చేరుకొనేవరకు నిన్ను వెంటాడుతూ ఉంటాడు, ఆ వస్తువు తాలుక అనుభవాన్ని పొందేవరకు నిన్ను విడిచిపెట్టడు. అన్ని పరిస్థితులలో, అన్ని ప్రదేశాలలో గురువు నీకూడా ఉంటూ నువ్వు ప్రమాదంలో పడకుండా నిన్ను కాపాడుతూ ఉంటాడు. నీకు భయం కలిగినప్పుడు ధైర్యాన్ని ప్రసాదిస్తాడు.

రూపంకంటే గుణం గొప్పది, గుణం కంటే జ్ఞానం గొప్పది, ఆ విషయం మర్చిపోవద్దు. కళ్యాణ గుణాలు జ్ఞానానికి దారి చూపిస్తాయి. వివేకానంద ఏమనిచెప్పారు అంటే నీకు దుఃఖం వస్తూ ఉంటే ఆ దుఃఖాన్ని ఇతరులకు పంచిపెట్టకు. నీకు ఉన్న శాంతిని, సుఖాన్ని ఇతరులకు పంచిపెట్టు అన్నారు కాని మనం ఏమిచేస్తాము అంటే మనకు ఏదైనా దుఃఖం వస్తే ఇతరులకు పంచిపెడతాము, అశాంతివస్తే అందరికీ పంచిపెడతాము, ఏదైనా సుఖం వస్తే మటుకు మనమే అనుభవిస్తాము. గురువు శాంతిదాత, కాంతిదాత, ప్రేమదాత, వాడుశాంతిని ఇవ్వాలని ఇవ్వడు, ఇవ్వకుండా ఉండలేడు కాబట్టి ఇస్తాడు. నీకు ఎంత చదువు ఉన్నా, ఎంత ధనం ఉన్నా, ఎన్ని శక్తులు ఉన్నా గురువు యొక్క అనుగ్రహం లేకుండా మోక్షాన్ని పొందలేవు. గురువు అంటే ఆత్మ. దేనిని పొందుదామని నువ్వు అనుకొంటున్నావో నువ్వు ఎంత కర్మకాండ చేసినా, ఎంత సాధన చేసినా దాని అనుగ్రహం లేకుండా దానిని పొందలేవు. గురువు యొక్క దయ ఎలా ఉంటుంది అని ఒకరు అడుగుతున్నారు. గురువు యొక్క దయ ఇట్టిది అని మనం మాటలతో చెప్పలేము, కాగితాల మీద వ్రాయలేము. అది మాటలకు అతీతం, ఊహలకు అతీతం, అది అనుభవైకవేద్యం. గురువు యొక్క అనుగ్రహం వర్షించినప్పుడు అది స్పష్టంగా మీకు తెలుస్తుంది. ఎంత స్పష్టంగా తెలుస్తుంది అంటే ఆ చేయి ఈ చెయ్యిని తాకినప్పుడు ఆ స్పర్శ ఎలా తెలుస్తుందో గురువు యొక్క అనుగ్రహం మీ హృదయాన్ని తాకినప్పడు ఇది గురువు అనుగ్రహం అని అంత స్పష్టంగా మీకు తెలుస్తూ ఉంటుంది. సముద్రాన్ని గురిపెట్టుకొని, సముద్రంలో కలిసేవరకు విశ్రాంతి తీసుకోకుండా నది ఎలా ప్రవహిస్తూ ఉంటుందో అలాగే నువ్వు కూడా శివుడిని స్మరిస్తూ, శివుడిని ధ్యానిస్తూ, శివానుగ్రహం పొందటంకోసం పనిచేస్తూ, శివుడినే గమ్యంగా పెట్టుకొని జీవించి ఆయనను పొందమని శివరాత్రి రోజున చెప్పే సందేశం.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఏప్రియల్ | 16 | పాలకొల్లు, క్షత్రియ కళ్యాణ మండపం |
| ఏప్రియల్ | 26 | శంకర జయంతి, శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# గురు బోధ

మానవుడిని మహనీయుడుగా, మహనీయుడిని ఋషిగా తయారు చేసేది సద్గురు బోధ ఒక్కటే! అనుగ్రహమే గురువు యొక్క స్వరూపం. సద్గురువు జగత్తును స్వరూపశాంతితో నింపుతారు. గురు బోధను శ్రద్ధగా శ్రవణం చేసి, మననం చేయడం వల్ల వివేచనా శక్తి పెరిగి, ఆచరించాలనే బుద్ధి కలిగి, తద్వారా మనోమాలిన్యము కడిగి వేయబడుతుంది. అట్టి సద్గురువు మనకు లభించినప్పుడు స్వరూపానుభూతికై తగిన ప్రయత్నం చెయ్యక కాలాన్ని వ్యర్థం చెయ్యడం కన్న పొరపాటు మరియొకటి లేదు. సత్య జ్ఞానము వల్లనే సత్యము తానుగా అనుభవైకవేద్యం అవుతుంది. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి రావాలంటే ఇష్టాఇష్టాలను వదలుకోవాలి, ద్వంద్వాలను అతిక్రమించాలి. 'నేను-నాది' అన్న భావనలే మన స్వీయ అభివృద్ధికి ఆటంకము. భ్రాంతికి వాస్తవ రూపాన్ని కల్పించే అహంకారం వల్లనే అశాంతికి లోనై భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శించలేకపోతున్నాం. నిప్పుపై వేగిన గింజ మొక్కగా మొలచుట ఎట్లు సాధ్యముకాదో అట్లే, శాంతిలేని వానికి సుఖము లభించుట అసంభవము. కాబట్టి నిరంతరము శాంతిని కాపాడుకోవాలి. బ్రహ్మము దేహంగా, ప్రపంచంగా కనిపిస్తున్నంతకాలం నిజమైన ఆనందం లభ్యంకాదు. మన దుఃఖానికి, అశాంతికి కారణం మన ప్రారబ్దమే, ఇతరులు కారని స్పష్టంగా గుర్తించాలి. ఏ మార్గంలో ప్రయాణం చేసినా మనోనాశం గమ్యం కాబట్టి నిరంతర శ్రద్ధ, అభ్యాస వైరాగ్యములు, సత్సంగము, విచారణ ద్వారా మనస్సు అంతర్ముఖమై వాస్తవంగా తానెవరో? అనుభవైకవేద్యం అయినప్పుడే ఈ మానవజన్మకు సార్థకత.

**- చావలి సూర్యనారాయణమూర్తి, టీచర్, అమలాపురం**

# మనస్సు అనేది గతజ్ఞాపకాల ధూళి - దాన్ని నామజపంతో గడపటమే సాధన

ఆధ్యాత్మిక ప్రగతికి మనస్సే పెద్ద ఆటంకము. మనస్సు అనేది అద్దంపై పేరుకొనిపోయిన ధూళి. అది ఎంత మందంగా ఉంటే మన ప్రతిబింబం కనబడదు. మనం ఎన్నో వేల జన్మల నుంచి కూడబెట్టుకొని వెళుతున్నాము. మన గతం అంతా 'గుర్తులు' లేదా వాసనలు అవి మెదడులో నిక్షిప్తమైనవి. అవి విత్తనాలు అంటారు. మనం ఒంటరితనంలో ఉన్నామని అనుభూతి పొందితే మనకు సమస్యలు కావలసివస్తే మనం వాటిని కొనితెచ్చుకోవచ్చు, లేదా దుఃఖాలు అయినాసరే. అవి మనకు అవసరం లేదు, అవి మన ఎంపిక, మన ఇష్టం. సాధకుడు ఈ మర్మాన్ని గుర్తుంచుకొంటే విశ్రాంతే. ఆ జ్ఞాపకాలు గడ్డకట్టి కుప్పగా ఉన్నాయి. అవే అహంభావనను సృష్టిస్తాయి. అవి ఉన్నాయనే విషయాన్ని 'నేను' అనే ఆలోచన ద్వారా వ్యక్తమౌతుంది. మనం వాటికి సాక్షిగా ఉంటే ఓ ఆలోచనారహితమైన అమనస్కమైన స్థితిలో ఉంటాము. మనం ఎప్పుడైతే మనస్సుకి లోతుగా, గాఢంగా చూస్తామో అప్పుడు అవి మాయమైపోతాయి. అంటే అవి దుమ్మయని నమ్మి విసర్జిస్తే వాటిపై ఆసక్తి నశిస్తుంది. ఆలోచనలు మబ్బు లాంటివి. మనమే వినీలాకాశం. ఆకాశాన్ని మబ్బులు ఏమీ చెయ్యలేవు. జార్జిగుర్జీఫ్ "నిరంతరంగా మీరు ఎక్కడ ఉన్నా సరే మిమ్ములను మీరు గుర్తుంచుకోండి" అంటారు. అంటే ఆత్మ ఎరుకలో జీవించు అని అర్థం కాని మనం అలవాట్ల ద్వారా బ్రతుకుతున్నాము. అలాగే ఉంటే అది ఎప్పటికీ అలాగే ఉంటుంది. దాని సొంత శక్తి దానికి ఉంది. అది మన ఏమరపాటువల్ల మనలో నుంచే శక్తిని తీసుకొని దాని ఆట అది ఆడుతోంది. మనం గతంలో దానికి సహకరించాము. ప్రస్తుతం కూడా అలాగే సహకరిస్తున్నాము. అది మనకు యజమాని అయి మనలను ఆజ్ఞాపిస్తున్నది, శాసిస్తున్నది. మనం విధేయులై దానికి సేవకునిగా మారాము. ఆ అలవాట్లను మనం అనుసరించి తీరాలని నిర్భందిస్తుంది. మనం బాధితులమై అశాంతిలో గడుపుతాము. దీనినే "కర్మ సిద్ధాంతం అంటారు" పెద్దలు. అసలు నేరస్తుడైన 'నేను' చనిపోతే కర్మ సిద్ధాంతం ఎవరికి వర్తిస్తుంది. అందుచేత గతానికి స్వస్తి చెప్పాలి. భగవాన్‌ని కర్మలు ఎలా పోతాయి? అంటే "మర్చిపోతే పోతాయి" అన్నారు. అలా చెయ్యకపోతే దెయ్యం జీవితం గడపవలసిందే. ప్రాణంలేనిది మన చుట్టూ తిరుగుతూ వెంటాడి వేధిస్తున్నది. సంతోషాలతో, విచారాలతో, విషాదాలతో, కోపంగా, అసూయతగ మనం తయ్యారయ్యేలా చేస్తున్నది. ఏ విషాదం జరిగినా మొదట కోపం వస్తుంది. దాన్ని శరీరం అనుసరిస్తుంది. తరువాత శరీరానికి రోగం వస్తుంది. గడిచిపోయిన దాని గురించి ఏడ్చి మొరపెట్టుకోవద్దు అది తెలివి తక్కువతనం. జాగృతిలోకి రావాలి. మనస్సు మధ్యలో వచ్చి దాని పాట ఆటను మొదలుపెడుతుంది. పశ్చాత్తాపం వద్దు, తప్పు చేసామని అనుకోవద్దు. శ్రీనాన్నగారు "పూర్వజన్మలో వాటిని అనుసరిస్తే ఈ జన్మలో అవి మనలను అనుసరిస్తాయి" అన్నారు. ఏదో ఒక ఆలోచన మనలను హఠాత్తుగా సుదీర్ఘంగా తీసుకొని పోతుంది. దాన్ని మనం గుర్తించాలి. కొంచెం తెలివిని ఉపయోగించి గురునామ జపంతో దాన్ని తమురుతూ ఉంటే దాని బలం తగ్గిపోయింది అని గ్రహిస్తాము. అదే సాధన. పరమహంసగారు "నీటి మీద పడవ ఉండవచ్చు, పడవలో నీళ్ళు ఉండకూడదు. సంసారంలో మనం ఉండవచ్చును, మనలో సంసారం ఉండకూడదు" అన్నారు. వ్యవహార పరిష్కారానికి మనస్సును వాడుకో దానితోనే ఉండకూడదు అంతే.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**